నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, సోమవారం 24 జూన్ 2024 HYDERABAD


# అవినీతి అధికారులకు బదిలీ బహుమతి

**ఉత్తర్వులు జారీ చేసిన రాచకొండ సీపీ**



సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): స్టేషన్‌కు వచ్చిన వారి ఫిర్యాదు తీసుకోకుండా డబ్బు కోసం ఇబ్బందులకు గురిచేయడం, నిందితులతో దోస్తీ చేస్తూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే ముఠాలకు సహకరించే పోలీసులపై రాచకొండ సీపీ తరుణ్‌జోషి చర్యలు చేపట్టారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగాయత్ ప్రాంతంలోకి వచ్చే జంటలను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు లాగుతున్న ముఠాలతో సంబంధాలు పెట్టుకున్న ఎస్సై శంకర్‌ను శనివారం సీపీ కార్యాలయానికి అటాచ్ చేయగా, తాజాగా ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డిని కూడా అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చిన బాధితులతో సరిగా వ్యవహరించకపోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదులో నిర్లక్ష్యం వహించడంతో సీపీకి ఫిర్యాదు వెళ్లింది. ఈ విషయంలో నాగోల్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్, ఎస్సై, ఏఎస్సైలను అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉప్పల్ ఠాణాకు డీసీ మన్మధకుమార్, నాగోల్ ఠాణాకు ఎల్బీనగర్ డీఐ ఎ.సుధాకర్‌లకు అదనంగా ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు అప్పగించారు.



స్టాలిన్ నగర్‌లోని ప్రభుత్వ భూమిని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి

# సర్కారు భూములకు రక్షణేది.?

## క్షేత్ర స్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టేట్ విభాగం అధికారుల మధ్య లోపించిన సమన్వయం

తాజా ఘటనతో మేల్కొన్న హెచ్‌ఎండీఏ

స్థలం చుట్టూ ఫెన్సింగ్.. రూ.**2.65** కోట్ల అంచనాలతో పనులు

టెండర్లు పిలిచిన హెచ్‌ఎండీఏ

**కో**ట్ల విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారుల మధ్య సమన్వయం లోపించింది. ఫలితంగా వేల కోట్లు విలువ చేసే భూములను కబ్జా చేసేందుకు ప్రజలు ఆ భూముల్లో జెండా పాతేస్తున్నారు. మియాపూర్‌లో హెచ్‌ఎండీఏకి ప్రభుత్వం అప్పగించిన వందలాది ఎకరాలపై కబ్జాదారుల కన్ను పడింది. మియాపూర్ రెవెన్యూ పరిధిలోని 100,101 సర్వే నంబర్లలో సుమారు 450 ఎకరాల భూమి హెచ్‌ఎండీఏ ఆధీనంలోనే ఉంది. అక్కడ గతంలో 100 ఎకరాల్లో ఇంటర్ సిటీ బస్ టర్మినల్ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసి, పీపీపీ ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించింది. అనివార్య కారణాలతో ఆ ప్రాజెక్టు ఆగిపోగా, అప్పటి నుంచి ఆ స్థలం ఖాళీగానే ఉంది. ఆ భూములపై వివాదం రాజుకోవడంతో సుప్రీం కోర్టు స్టే ఇచ్చినా, హెచ్‌ఎండీఏ ఆధీనంలోనే ఉంది. అయితే ఒకే చోట వందల ఎకరాల్లో ఉన్న భూమిని కాపాడాల్సిన హెచ్‌ఎండీఏ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా మూడు రోజులుగా మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూములను కబ్జా చేసి గుడిసెలు వేసుకునేందుకు వేలాది మంది తరలివచ్చి అక్కడ తిష్టవేసిన పరిస్థితి. వందలాది మంది పోలీసు బలగాలు రక్షణగా వచ్చి స్థలాన్ని కాపాడాల్సిన పరిస్థితికి దారితీసింది.

- సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ)

### ఆఫీసుకే పరిమితమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం

ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా ఏర్పాటైన హెచ్‌ఎండీఏకు ప్రభుత్వం గ్రేటర్‌లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను అప్పగించింది. అలా హెచ్‌ఎండీఏ ఖాతాలో సుమారు 8,540 ఎకరాల భూములున్నాయి. వీటిలో మియాపూర్‌లోని సర్వే నం. 100,101లో సుమారు 450 ఎకరాల భూమి ఉంది. వీటిని పరిరక్షించే బాధ్యత ఎస్టేట్ విభాగం , ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారుల సంయుక్త బాధ్యత. ఈ రెండు విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో క్షేత్ర స్థాయిలో భూముల వద్ద కాపలాగా ఉండాల్సిన వారు అక్కడ విధులు నిర్వహించడం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న కబ్జాదారులు రాత్రికి రాత్రే తాత్కాలిక కట్టడాలు, గుడిసెలు వేస్తూ స్థలాల్లో పాగా వేస్తున్నారు. ఎస్టేట్ విభాగం తరపున మొత్తం ఏడుగురు సైట్ ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో హెచ్‌ఎండీఏ భూములను ప్రతి రోజు ప్రత్యక్షంగా సందర్శించి అక్కడ జరుగుతున్న విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తేవాలి. కానీ, రెండు విభాగాల మధ్య సమన్వయ లోపమే మియాపూర్‌లో భూములను కబ్జా చేసేందుకు అవకాశం కల్పించిందనే ఆరోపణలు ఉన్నాయి.



సామాజిక మాధ్యమాల్లో స్థలాలిస్తున్నారని వైరల్ కావడంతో మియాపూర్ హెచ్‌ఎండీఏ స్థలం వద్దకు వచ్చిన ప్రజలు

## భూముల పరిరక్షణకు రూ.2.65 కోట్లతో ఫెన్సింగ్...

మియాపూర్‌లో ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్ను పడింది. ఇటీవల కొందరు ఖాళీ భూముల్లో మొదట గుడిసెలు వేయగా, ఆ తర్వాత సోషల్ మీడియాలో ప్రభుత్వ భూముల్లో పేదలకు స్థలాలు ఇస్తున్నట్లు ప్రచారం చేశారు. దీంతో ఒక్కసారి 4వేల మందికి పైగా పేద ప్రజలు రెండు, మూడు రోజుల వ్యవధిలోనే మియాపూర్ భూముల్లోనే తిష్ట వేసుకొని కూర్చుకున్నారు. ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో ఇదంతా జరుగుతుందని గుర్తించారు. జరిగిన ఘటనపై హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ వెంటనే పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్టేట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను ఆదేశించారు. దీంతో ఒక్క రోజు వ్యవధిలోనే ఫెన్సింగ్ పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. సుమారు రూ.2.65 కోట్ల వ్యయంతో స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

# ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

సీపీ అవినాష్ మహంతి

మియాపూర్ ప్రభుత్వ భూమి వద్ద 144 సెక్షన్

ఎట్టకేలకు వెనుదిరిగిన ప్రజలు

మియాపూర్ , జూన్ 23 : మియాపూర్ స్టాలిన్ నగర్‌లోని సర్వే నం. 100, 101లో ఉన్న ప్రభుత్వ భూమిలోకి ఎవరు రావొద్దని , ఆక్రమణలకు యత్నిస్తే చర్యలు తప్పవని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి హెచ్చరించారు. ఇండ్ల స్థలాలివ్వాలంటూ శనివారం వేల సంఖ్యలో ప్రజలు ప్రభుత్వ భూమి వద్దకు చేరుకున్నారు. వారికి నచ్చజెప్పేందుకు యత్నించిన పోలీసులపై రాళ్ల దాడి చేయడంతో అధికారులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఈ స్థలాన్ని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదివారం పరిశీలించి మాట్లాడారు. ఇండ్ల స్థలాల కోసం విన్నవించుకునే ప్రజలు తగిన విధానాన్ని పాటించాలన్నారు. ఆక్రమణలకు పాల్పడటం చట్ట వ్యతిరేకమని హెచ్చరించారు. సర్వే నం.100 , 101లోని ప్రభుత్వ భూమిలోకి రావడాన్ని నిషేధించినట్లు, నిబంధనలకు విరుద్ధంగా చొరబడితే చర్యలు తప్పవని సీపీ స్పష్టం చేశారు. ఈ స్థలం పరిసరాల్లో బందోబస్తుతో పాటు, 144 సెక్షన్ అమలులో ఉందని సూచించారు. అయితే పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డ వారిని గుర్తించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి వరకు ఆ స్థలం వద్దే ఉన్న ప్రజలు.. ఆదివారం వెళ్లిపోయారు. సీపీ మహంతి వెంట డీసీపీ డాక్టర్ వినీత్, అదనపు డీసీపీ జయరాం, మియాపూర్ ఏసీపీ నర్సింగరావు, సీఐ దుర్గారామలింగ ప్రసాద్, శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి , ఎస్టేట్ అధికారి వీరారెడ్డి ఉన్నారు.


### పరిశీలించిన అదనపు కలెక్టర్..

మియాపూర్ : మియాపూర్ పరిధిలోని సర్వే నం. 100 , 101లో ఉన్న ప్రభుత్వ భూములను శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ వెంకారెడ్డితో కలిసి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ రెండు సర్వే నంబర్లలోని భూములు ప్రభుత్వానివేనని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గతంలోనే తీర్పునిచ్చిందని పేర్కొన్నారు.

# కత్తులతో స్నాచర్ల వీరంగం

కాల్పులు జరిపిన పోలీసులు

ఇద్దరి అరెస్ట్



సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): అర్ధరాత్రి సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసి పారిపోతున్న దొంగలపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో స్నాచర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్నాచర్ల వద్ద నుంచి మారణాయుధాలు, దొంగిలించిన బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ కథనం ప్రకారం.. ఫలక్‌నుమా, ముస్తఫానగర్‌కు చెందిన మసూద్ ఉర్ రహమాన్ వెల్డర్‌గా, క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విలాసాలకు తన సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాల బాట పట్టాడు. 2020లో ఈజీ మనీ కోసం ప్రయత్నించి దొంగతనాలు, స్నాచింగ్ చేయడంతో మైలార్‌దేవ్‌పల్లి, నాచారం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ నెల 20న తెల్లవారుజామున ముషీరాబాద్‌లోని తన బంధువు ఇంటికి వెళ్లాడు. అక్కడ స్క్రాప్ బిజినెస్ చేసే ఫజల్ ఉర్ రహమాన్‌ను కలిసి, తాను దోపిడీకి వెళ్తున్నానని తనతో రావాలని వెంట తీసుకెళ్లాడు. దోపిడీ చేసే సమయంలో ఎవరైనా అడ్డుకుంటే వాళ్లపై దాడి చేసేందుకు డాగర్, కత్తితో బయలు దేరారు. చాదర్‌ఘాట్ వైపు వెళ్లి స్వాగత్‌బార్ వద్ద యాక్టీవా వాహనాన్ని దొంగిలించి, అక్కడి నుంచి ముషీరాబాద్‌లోని బోలక్‌పూర్ స్టార్ హోటల్ వద్దకు చేరుకొని అక్కడ పార్కు చేశారు. దీనిని తరువాత విక్రయించేందుకు ప్లాన్ చేశారు. అనంతరం తెల్లవారుజామున 2, 3 గంటల సమయంలో సికింద్రాబాద్ గణేశ్ ఆలయం సమీపంలో ఒక వ్యక్తి వెళ్తుండటంతో అతని వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కునేందుకు ప్రయత్నించడంతో బాధితుడు అడ్డుకున్నాడు. ఇద్దరు వాహనం దిగి తమ వద్ద ఉన్న కత్తులతో బాధితుడ్ని బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితుడు గట్టిగా అరుస్తుండటంతో యాంటీ స్నాచింగ్ కానిస్టేబుల్ అక్కడకు చేరుకొని దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ఇంతలో బాటా షోరూం దగ్గర నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించారు. అక్కడి నుంచి మళ్లీ పరారై సిటీలైట్ హోటల్ వైపు పరిగెత్తుతుండటంతో వారిని వెంబడిస్తున్న కానిస్టేబుల్ తన వద్ద ఉన్న గన్‌తో ప్రధాన నిందితుడి కాలుపై కాల్చాడు. నిందితులు పారిపోయారు. అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు 48 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేశారు.

# కొత్వాల్‌గూడకు లింకు రోడ్డు

రూ.2.97 కోట్లతో హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు హెచ్‌ఎండీఏ ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తోంది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సమీప గ్రామాలకు మెరుగైన రోడ్డు నెట్ వర్క్ ఉండేలా చర్యలు చేపట్టింది. శంషాబాద్-రాజేంద్రనగర్ మధ్య ఉన్న ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు కొత్వాల్‌గూడ వరకు రూ.2.97 కోట్లతో హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు రూపొదించింది. ఓఆర్ఆర్ సర్వీసురోడ్డులోని చెన్నమ్మ హోటల్స్ నుంచి కొత్వాల్‌గూడ వై.ఆర్.రెడ్డి హౌస్ వరకు లింకు రోడ్డు నిర్మాణం ద్వారా ఆ ప్రాంత వాసులకు మెరుగైన రోడ్డును అందుబాటులోకి తీసుకురానున్నారు.

# నత్తే నయం..

పూర్తి కాని ఎస్ఆర్‌డీపీ పనులు

అధికారుల నిర్లక్ష్యంతో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు

ట్రాఫిక్ కష్టాలు అధికమవుతున్నా.. కనిపించని పురోగతి

గడువులోగా పూర్తి కాని ఎస్ఆర్‌డీపీ పనులపై ప్రజల ఆగ్రహం

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ ) : వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి) పనులపై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను వేసింది. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా రూ.5112.36కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులు చేపట్టగా.. 38 చోట్ల అందుబాటులోకి తీసుకువచ్చి ట్రాఫిక్ కష్టాలను దూరం చేశారు. అయితే పురోగతిలో ఉన్న 9 ప్రాజెక్టులకు నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసింది. గడువులోగా పనులను పూర్తి చేసి విడతల వారీగా అందుబాటులోకి తీసుకురావాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులపై సమీక్షించిన దాఖలాలు లేవు. ఫలితంగా ఎస్ఆర్‌డీపీ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. ఇప్పటికే బైరామల్‌గూడ లూప్‌లు అందుబాటులోకి రావాల్సి ఉన్నప్పటికీ పనులపై తీవ్ర జాప్యం నెలకొంది. ఈ క్రమంలోనే శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. భూసేకరణ సమస్య వెంటాడుతోంది. ఆరు చోట్ల ప్రాజెక్టులకు నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసినప్పటికీ సకాలంలో అందుబాటులోకి రావడం కష్టమేనని స్వయంగా అధికారులే చెబుతున్నారు. పనుల్లో వేగం పెంచాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు ఖర్చు పెరగడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు అధికమవుతుండటం పై నగరవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఎస్ఆర్‌డీపీ తొలి విడత పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## పురోగతిలో ఉన్న ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు ఇవే..

| ప్రాజెక్టు | అంచనా వ్యయం (రూ.కోట్లలో) | పూర్తి కావాల్సిన సమయం |
|---|---|---|
| శాస్త్రీపురం ఆర్వోబీ | 71 | ఈ నెలాఖరు నాటి కల్లా పూర్తి |
| ఫలక్‌నుమా ఆర్వోబీ | 47.10 | ఈ నెలాఖరు నాటికల్లా పూర్తి |
| శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ (స్టేజీ-2) | 275 | 2024 ఆగస్టు చివరి నాటికి |
| నల్గొండ క్రాస్‌రోడ్ నుంచి ఒవైసీ హాస్పిటల్ జంక్షన్ నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ | 370 | 2024 డిసెంబర్ నాటికి |
| ఆరాంఘర్ నుంచి జూపార్కు ఫ్లై ఓవర్ | 636.80 | 2024 డిసెంబర్ నాటికి |
| ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్ | 311 | 2024 డిసెంబర్ నాటికి |





# సూపర్ మోసాలు !

కాలం చెల్లిన ప్యాకింగ్‌లు, ఆహార పదార్థాలు

డీ మార్ట్, బీ మార్ట్‌లపై టాస్క్‌ఫోర్స్ చర్యలు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ ) : సూపర్‌మార్కెట్‌కు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త...నాసిరకం ఫుడ్ ప్యాకెట్లు, ఎక్స్‌పైరీ డేట్ దాటిన ఉత్పత్తులు కస్టమర్లకు అంటగడుతున్నారు. అన్నీ ఒకే చోట లభిస్తాయి కదా అని వెళ్లిన వినియోగదారుడి అవసరాన్ని ఆసరాగా చేసుకొని నాణ్యత లేని ఆహార పదార్థాలను అంటగడుతున్నారు. కొన్ని రోజులుగా ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు హాస్టళ్లు, హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టగా తాజాగా సూపర్ మార్కెట్లపై దృష్టి సారించారు. వనస్థలిపురం డీ మార్ట్‌లో స్ప్రౌట్స్, బేబీ కార్న్, మష్‌రూమ్ వంటి న్యూట్రివాలా బ్రాండ్స్ గడువు తీరినట్లు గుర్తించారు. తుర్కయాంజల్‌లోని బీ పార్టు (బాలాజీ మార్ట్ ఎంటర్‌ప్రైజెస్)లో ఐదు కిలోల రాగి పిండి, 208 కిలోల ఇడ్లీ రవ్వ, ఉరద్ గోటా 150 కిలోలను స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకున్నారు. మొత్తంగా సూపర్‌మార్కెట్లలో కొనుగోలు చేసే ప్యాకింగ్ వస్తువులను చూసి కొనాలని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లలో కల్తీ, నకిలీ వస్తువులు విరివిరిగా దొరుకుతున్నాయి.. తాగేనీరు, తినే పదార్థాల ప్యాకింగ్‌పై అవి తయారు చేసిన తేదీ, ఎప్పటి వరకు వాడొచ్చు, చిరునామా తదితర విషయాలను సరి చూసుకోవాలి. కొన్ని దుకాణాల్లో తేదీ దాటిన తర్వాత కూడా సంబంధిత వస్తువులను విక్రయిస్తుంటారు. అందువల్ల వినియోగదారుడు గమనించి కొంటే మంచిదని చెబుతున్నారు.



ఆదివారం వర్షంతో జలమయమైన పాత నగరంలోని ప్రధాన రహదారి

# భారీ వర్షం..

విద్యుత్‌కు అంతరాయం



సిటీబ్యూరో, జూన్ 23 ( నమస్తే తెలంగాణ): నగరంలో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తింది. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు చోట్ల విద్యుత్ లైన్లపై చెట్లు కూలి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. వర్షం ప్రారంభం కాగానే పెద్ద శబ్దం వచ్చిందని, వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలోని సాయి గార్డెన్ ప్రాంతంలో 11 కేవీ ఫీడర్ లైన్‌పై చెట్టు కూలడంతో విద్యుత్ స్తంభం పూర్తిగా ధ్వంసమైందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి ఫీడర్ పరిధిలో ఈఎస్ఐ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారులు స్పందించి సరఫరా పునరుద్ధరించారు. బడంగ్‌పేట 11కేవీ ఫీడర్, లెనిన్ నగర్ సబ్‌స్టేషన్, 11కేవీ బేగంబజార్ ఫీడర్, 33/11 కేవీ ఉస్మానియా ఆస్పత్రి సబ్ స్టేషన్, 33/11కేవీ గ్రీన్‌ల్యాండ్ సబ్‌స్టేషన్, 11 కేవీ బండ్లగూడ జాగీర్, 33/11 కేవీ స్నేహిత హిల్స్ సబ్ స్టేషన్‌ల పరిధిలో వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తిందని అధికారులు తెలిపారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 11కేవీ డాక్టర్ కాలనీలో ఫీడర్ కేబుల్ దెబ్బతిని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, అలాగే హబ్సిగూడ సర్కిల్‌లో 11కేవీ చెన్నారెడ్డి తోట ఫీడర్ పరిధిలో ఇన్సులేటర్ దెబ్బతింది. ఎమర్జెన్సీ బృందాలు యుద్ధ ప్రాతిపదికన క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టాయని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

కాగా, అత్యధికంగా చార్మినార్.. డబీర్‌పురాలో 7.1 సెంటీ మీటర్లు, సర్దార్ మహల్‌లో 7.0 సెం.మీ, ఆసిఫ్‌నగర్ జియాగూడ రంగనాథ టెంపుల్, నాంపల్లి జుమ్మేరాత్ బజార్ ప్రాంతాల్లో 6.9 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు.